# పాము

## 1

కామమ్మ, కామయ్య పరమపద సోపానపఠం ముందుంచుకుని, చెరోపావూ దగ్గర పెట్టుకున్నారు. ఆ పఠానికి రెండో పేరు వైకుంఠపాళీ. మొదటి పేరెందుకొచ్చిందంటే, వామనుడు మూడడుగులు అని దానంపట్టి కొలుస్తూ, ఒకటిఅని భూమి ఆక్రమించాడు, రెండవ అడుగు అని, పాదం ఆకాశంలోకిపాకి వ్యాపించింది. బ్రహ్మదేముడొచ్చి ఆ పాదం కడిగి ఆనీళ్ళు నెత్తిన చల్లుకున్నాడు. వామనుడు వ్యాపింప జేసిన రెండవ పాదమే పరమపదం.

ఆడేవాడు అక్కడికి చేరాలంటే పఠంనిండా నిచ్చెనలూ పాములూ వుంటాయి, అంటే కష్టసుఖాలనుభవిస్తూ పరమపదం చేరాలని, నూటయెనిమిది గళ్ళుంటాయి, పరమపదం చేరబోతున్నా మనుకుంటుండగా అరుకాసురుడనే పెద్దపాము మింగి మొదటి గడిలోకి దింపగా, మరోపందెం రెండుపడితే, రెండు గళ్ళఅవతల మరోచిన్న పాము మింగి పఠంనించి కిందకి తోసేస్తుంది. కనకజాగ్రత్తగా ఆడాలి, గవ్వలు దొర్లించడంరావాలి పందెం వేయటం రావాలి, నాలుగే గవ్వలు, అన్నీ బోర్లపడితే నాలుగు, అన్నీ వెల్లికిలాపడితే యెనిమిది, అవిరెండూ పెద్ద పందేలు, అవి పడితే మరోఅవకాశం గవ్వలు దొర్లించేందుకు వస్తుంది, మూడు, రెండూ, ఒకటీ చిన్నపందేలు.

కామయ్య రెండుసార్లు అరుకాసురునిచే కరవబడి, మూడవసారి ఆ పెద్దపాముని దాటి పరమపదం చేరగలిగాడు, ఆట ఆపి వెళ్ళిపోయాడు.

కామమ్మకుతోడుగా జానమ్మవచ్చి ఆడసాగింది, కామమ్మకు ఆటబాగానే వచ్చు, గవ్వలు-బాగానే దొర్లిస్తుంది. కాని ఆమెపావు అశ అనే బొమ్మమీద కూచుంటుంది పోయి, నడిపిస్తుంటే పాములచే కరవబడి కిందికి దిగుతుంది.

జానమ్మకి గెలవాలనీ లేదు. సరదాకోసం ఆడుతుంది. నిచ్చెనెక్కంగానే నవ్వుతుంది. పాము కరవగానే అయ్యో కరిచింది అంటుంది, మళ్లా గవ్వలు దొర్లిస్తుంది.

## 2

కామమ్మ తనపావును నడుపుతూ, పందెంవేస్తూ డబ్బావరపతీ అందంవున్న గడి చేరాలని చూస్తున్నది, ఆమె పావు పేరు సరసిజ. బొత్తిగా దూరదృష్టిలేదు, ఒకటేతొందరపాటు. తల్లిపేసే పందెంతో ఆగడి చేరగలమని ఆశిస్తుంది, కాని నడకలో నేర్పులేదు, పాము తలమీదుగా నడిచి దానినోట్లో పడుతుంది, కిందికి దిగుతుంది. కామమ్మ మళ్లా పందెం వేస్తుంది. గవ్వల్లు దొర్లిస్తుంది, నడుస్తుండగా అవరసదాటి పైకిపోగానే పక్కగడిలోనే మరోపామూ, దానినోట్లోపడింది. తొందర పాటువల్ల మనస్సు వికలమై నడవలేక కూలబడింది. గడిఅకర్షిస్తునే వున్నది. గడిపేరు పెన్నిధానరావు.

వీరిట్లా ఆడుతుండగా మరోమనిషి తనపావు తెచ్చుకుని వచ్చి కూచున్నది.

పైకుంఠపాళీ ఆడదలచిన వారెప్పుడైనా రావచ్చు. తమఆట మొదలెట్టవచ్చు, ఆటరావాలి, విసుగు జెందరాదు.

ఆవేశ పడరాదు, మరీ అత్యాశకుపోయి మొదటిసారే పరమపదం చేరాలనుకోరాదు, అదంత సులభముగాదు. దుర్లభమే. నిచ్చెన లెక్కుతూ పామునోట్లోపడుతూ పైకిపోతుందిపావు, అరుకాసురుని దాటాలి, ఆ తర్వాత భయంలేదు, ఇంకపాములు లేవు, నిదానంగా పరమపదం చేరగలుగుతారు. ఈ కొత్తామె పేరు సరస, నవ్వుతూ ఆడుతున్నది.

మధ్యాహ్నం భోజనాలైనై, వరం అక్కడేవున్నది మరొకామె వచ్చినది. పరమపదంచేరాలనే కోరికకన్నా మరొకరి పావు పామునోట్లో పడిందా లేదా చూస్తుంది. నిచ్చెన దాటి నడిచింది వారిపావు అని చూస్తుంది, ఈమెపేరు వెంకమ్మ "వెంకమ్మా? లేక నీపేరు పెంకెమ్మా?" అని నవ్వేవారు సాటి అమ్మాయిలు, రణ పెంకె ఇగో పెరిగిపోతుంది. గవ్వలు తిప్పటం రాదు, యేదో ఆడుతుంది, కంపెనీ కావాలి.

మధ్యాన్నం రెండున్నరకి ధనమూ, వరవతీ, అందం వున్న బొమ్మచేరి, ఆగడి దాటి పెద్దపాముదాటి పరమపదంలోకి పావును నడపించింది, సరస నవ్వుతూ లేచింది. తనపావును వదిలేసింది.

చాలు, చేరాగా తక్కినగళ్లు అనవసరం అంటూ చీర కుచ్చిలు కదిలిస్తువెళ్లిపోయింది.

వీళ్ళు ఆడుతూనే వున్నారు. జానమ్మనవ్వుతూనే వున్నది. కామమ్మ తాను చేరాలనుకున్న గడిలోకి తనపావును నడిపిస్తుంది గానీ పక్కనేవున్న పాముదాట లేక పోతున్నది.

అయిదయింది, పందుడిని మళ్లా ఆట సాంగించారు. కరుణాకరన్ వచ్చి నిలబడి చూచాడు.

"నేను గూడా ఆడానా"అని సరస వదిలేసి వెళ్లిన పావు అందుకుని. గవ్వలందుకుని కూడుని కొద్దిసేపే ఆడాడు, రెండు నిచ్చెన లెక్కాడు, ఒక పాము నోట్లో పడ్డాడు.

ఇది జీవితంతో చెలగాటం లాగా। గాంబ్లింగ్ లాగా వున్నది కొత్తేమున్న దీ ఆటలో, నేపోతున్నా టెన్నిస్‌కి వేళైంది అని వెళ్లి పోయాడు, పావు అక్కడే వున్నది.

వెంకమ్మ తన పావు నడవటం లేదని విసుకుకుంది. కరుణాకరన్ వదిలేసిన పావు తీసుకున్నది ఆడుతున్నది, ధనము వరవతీ అనే గడి చేరితేచాలు లేచివెళ్దామని చూస్తూ ఆడుతున్నది, ఫలహారం వేళవరకూ ఆడాలని వున్నది.

సరసిజ తనపావు ధనమూ అందమూ వరవతీ అనే గదిదాటి పరుగెత్తుతూ పాము నోట్లో పడటం గమనించింది నేలమీద కొంగు పరుచుకుని పడుకున్నది, కామమ్మతో అన్నది.

నే చూస్తూవుంటా నాపంతు వచ్చినప్పుడు నువ్వు గవ్వలు దొర్లించిఆడు, నాపావు బాగానడిస్తే నేనాడతా"

తమ యిద్దరి ఆటా కామమ్మే ఆడసాగింది.

నేను ఆడనా అంటూ కనకమ్మ వచ్చింది. మళ్లా ఆట జోరుగా సాగింది. సీతప్ప అనేతమ్ముడు వచ్చాడు కాసేపాడాడు ధనమూ, వరవతీ వరకే వెళ్లటం చాతకాక విసుగేసి గవ్వలు వది లేసి, పావువిసిరి కొట్టి వెళ్లిపోయాడు.

కొత్త పావుతో ఆడిన వెంకమ్మ ధనమూ పరవతీ పరకూ వెళ్లలేక పోతున్నది. పాముల నోట్లో పడుతున్నది.

నాకు ఫలహారం వేశ్శెందరాత్రి. నేను పోతున్నా పరమిక్కడే వుంటుందిగా . నాపావు ఆగడిమీదే వుండనీయండి రేపు మధ్యాన్నం వచ్చి ఆడతా. లేచి వెళ్లిపోయింది.

జానమ్మ నవ్వి నవ్వి ఆడి ఆడి లేచింది

రేపు వచ్చి ఆడతా చాలా బావుంది వైకుంఠ పాళీ, టైమే తెలియదు అని తన పావు పరంది మీదనించి తీసి కింద ఉంచి వెళ్లింది

సరసిజ అన్నం తెచ్చుకుని తిని పళ్లెం అవతలుంచి వచ్చి చెయ్యి కడుక్కుని నీళ్లుతాగి వక్క నములుతూ ఆట చూస్తూ నేల మీద పడుకున్నది.

కామమ్మ విసుగు లేకగవ్వలు దొర్లిస్తూ పరమ పదం గానీ కనీసం ధనమూ పరవతీ అనే గడికిగానీ చేరాలని పావును నడిపిస్తూనే ఉన్నది గళ్లులెక్కిస్తూనే ఉన్నది,

కొంత సేపటికి సరసిజ నిద్ర కొరిగింది.

కామమ్మ పరమపదంమీదే దృష్టి ఉంచి ఆట ఆపి వేయ లేదు, యేళ్లు గడిచి' కామమ్మకు తొంభై యేడేళ్లు వచ్చాయి చూపు మందగించలేదు ఆటమీద ఆసక్తి పోలేదు పావు పాతదైతే కొత్త పావుతో ఆడుతూనే ఉన్నది. పావును నడిపిస్తూనే ఉన్నది.

— (౦) —